సాక్షి
మెదక్
శుక్రవారం ၊ 2 ၊ మే ၊ 2025



సాగుకు సన్నద్ధం
వానాకాలం పంటల సాగుకు అన్నదాతలు సన్నద్ధం అవుతున్నారు.
వివరాలు 8లో ▸



ఆహ్లాదం కరువు
సంగారెడ్డి పట్టణంలోని పట్టణ ప్రకృతి వనం నిర్వహణ అధ్వానంగా మారింది.
వివరాలు 8లో ▸



బాలిక.. విజయ గీతిక
పదేళ్లుగా పదిలో వంద శాతం ఉత్తీర్ణతతో రేగోడ్ కేజీబీవీ సత్తా చాటింది.
వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

జడ్జిగా బాధ్యతల స్వీకరణ



జడ్జి హేమలతను సన్మానిస్తున్న న్యాయవాదులు

నర్సాపూర్/పాపన్నపేట(మెదక్): నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జిగా హేమలత గురువారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ నుంచి ఆమె బదిలీపై ఇక్కడకు వచ్చారు. బార్ అసోసియేషన్ ప్రతినిధులు, కోర్టు సిబ్బంది స్వాగతం పలికి సన్మానించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. కోర్టులో సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కరించేందుకు న్యాయవాదులు, సిబ్బంది సంపూర్ణంగా సహకరించాలన్నారు. అంతకుముందు ఏడుపాయల వనదుర్గమ్మను దర్శించుకున్నారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రాహుల్ చిత్రపటానికి క్షీరాభిషేకం



రాహుల్‌గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చిత్రపటానికి గురువారం కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ భారత్ జోడోయాత్రలో ప్రజల కష్టాలు గుర్తించారని తెలిపారు. కులగణన చేపట్టాల్సిన అవసరం ఉందని గుర్తించారని చెప్పారు. అందులో భాగంగా పార్లమెంట్ ఎన్నికల సమయంలో తమ పార్టీ మేనిఫెస్టోలో కులగణన చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. పార్లమెంటులో ప్రతిపక్ష నేతగా రాహుల్‌గాంధీ డిమాండ్ చేయడంతోనే కేంద్రం ప్రభుత్వం కులగణనకు అంగీకరించిందని వివరించారు. సమావేశంలో ప్యాక్స్ చైర్మన్ రాజుయాదవ్, నాయకులు మల్లేష్, రిజ్వాన్, చిన్న ఆంజిగౌడ్, సురేష్, రషీద్, నగేష్, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు



ఆలయ ప్రధాన గోపురం

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన దొంతి వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 6వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా జంట నగరాలు, వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 6న విష్వక్సేన పూజతో ప్రారంభమై 16న పూర్ణాహుతితో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

హక్కుల కోసం ఉద్యమిద్దాం




మేడే వేడుకల్లో సీఐటీయూ నాయకులు

మెదక్ కలెక్టరేట్: మేడే స్ఫూర్తితో కార్మికుల చట్టాలు, హక్కులను కాపాడుకోవడానికి ఐక్యంగా పోరాటం నడపాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. 139 ఏళ్ల క్రితం కార్మికులు సాగించిన సమశీల పోరాటాల ఫలితంగానే ప్రపంచ కార్మిక వర్గానికి కొన్ని హక్కులు దక్కాయన్నారు. కేంద్రంలోని మోదీ సర్కార్ అధికారంలోకి వచ్చి 4 లేబర్ కోడ్లను తెచ్చి కార్మిక హక్కులను, చట్టాలను కాలరాస్తుందన్నారు. ప్రశ్నించే, యూనియన్ పెట్టుకునే హక్కును హరిస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, శౌకత్, మల్లేశం, పద్మారావు, సుధాకర్, యాదయ్య, దుర్గ, లచ్చాగౌడ్, మున్సిపల్, ఆటో యూనియన్, పరిశ్రమల కార్మికులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్.. అంతంతే!

రాయితీ ఇచ్చినా స్పందన కరువు
- ముందుకు రాని దరఖాస్తుదారులు
- రేపటితో ముగియనున్న గడువు



మెదక్‌జోన్: లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)కు స్పందన అంతంత మాత్రంగానే ఉంది. ఫీజులో 25 శాతం రాయితీ ప్రకటించినా ప్రక్రియ మందకొడిగానే సాగుతోంది. యంత్రాంగం విస్తృతంగా ప్రచారం చేసినా దరఖాస్తుదారులు ముందుకు రావడం లేదు.

2020లో స్కీం ప్రారంభం

గత ప్రభుత్వం 2020లో ఎల్ఆర్ఎస్ స్కీంను తీసుకురాగా.. అప్పట్లో జిల్లాలోని మెదక్, రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 14,762 మంది ఆన్‌లైన్ ద్వారా రూ.1,000 చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. వివిధ కారణాలతో వాయిదా పడుతూ వచ్చింది. ఈ క్రమంలో 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎల్ఆర్ఎస్‌పై కదలిక వచ్చింది. దరఖాస్తుదారులు మార్చి 31 లోగా ముందుకు వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకుంటే అయ్యే ఫీజులో 25 శాతం రాయితీ ఇస్తామని చెప్పింది. అయినా పెద్దగా స్పందన రాకపోవడంతో ఏప్రిల్ వరకు అవకాశం ఇచ్చారు. మారోమారు ఈనెల 3 వరకు గడువు పొడిగించారు. అయితే దరఖాస్తులు వేలల్లో ఉండడం, సాంకేతిక సమస్యలు, సిబ్బంది కొరత, సమన్వయ లోపంతో ప్రక్రియ నత్తనడకన కొనసాగుతోంది. ఇదిలాఉండగా హైడ్రా భయం జిల్లాను సైతం వెంటాడుతుంది. ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారిలో ఎక్కువశాతం అనుమతులు లేని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్లాట్లతో పాటు బఫర్‌జోన్‌లో సైతం ప్లాట్లను కొనుగోలు చేశారు. మరికొందరు వ్యవసాయ భూముల్లోనూ కొనుగోలు చేశారు. అలాంటి ప్లాట్లను రెగ్యులరైజ్ చేసినా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాక కూలిస్తే మా పరిస్థితి ఏంటని పలువురు పేర్కొంటున్నారు. అందుకే ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

రుసుము చెల్లించింది 4,606 మందే..

జిల్లాలో 14,762 మంది ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోగా, రెండు నెలల వ్యవధిలో కేవలం 4,606 మంది మాత్రమే ఫీజు చెల్లించారు. ఇంకా 10,156 మంది ముందుకు రావడం లేదు. ఈ లెక్కన కేవలం 26 శాతం మాత్రమే చెల్లింపులు జరిగాయి. అయితే రాయితీ గడువు ఈనెల 3వ తేదీతో ముగుస్తుందని అధికారులు చెబుతున్నారు. అయితే మరో నెల పొడిగించాలని పలువురు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయండి

అదనపు కలెక్టర్ నగేష్



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేష్

కొల్చారం(నర్సాపూర్)/నర్సాపూర్ రూరల్/కౌడిపల్లి: ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ నగేష్ రైస్ మిల్లుల యజమానులు, అధికారులను ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని సత్యసాయి రైస్ మిల్లును తనిఖీ చేశారు. రైస్ మిల్లుకు ఇప్పటివరకు వచ్చిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అన్‌లోడింగ్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైస్ మిల్లుల్లో ధాన్యం తూకం, రవాణా, రైస్ మిల్లుల్లో అన్ లోడింగ్ కోసం అదనంగా లేబర్‌ను పెట్టుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్, తహసీల్దార్ గఫార్ మియా, ఆర్ఐ ప్రభాకర్ తదితరులు ఉన్నారు. అలాగే నర్సాపూర్ మండలం కాగజ్ మద్దూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. కొనుగోలు కేంద్రాల వద్దకు వచ్చే రైతులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవని నిర్వాహకులను హెచ్చరించారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని రైతులకు సూచించారు. కౌడిపల్లి మండలంలోని రాయిలాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ధాన్యం పరిశీలించి రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మెదక్ మున్సిపాలిటీ: పట్టణ పరిధిలోని హౌసింగ్ బోర్డు, ఔరంగాబాద్, అవుసులపల్లి పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్‌బాబు, టౌన్ ఏఈ నవీన్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ వార్డుల పరిధిలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించడంతో పాటు పలు ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.



తాత్కాలిక గుడారంలో నివాసం ఉంటున్న ఓ గిరిజన కుటుంబం

రాని బిల్లులు.. ఆగిన నిర్మాణాలు

- ఫొటో అప్‌లోడ్ కాక తిప్పలు
- మధ్యలోనే నిలిచిన ఇందిరమ్మ ఇళ్లు



ఈ చిత్రంలో కనిపిస్తున్న దంపతుల పేర్లు భూలి, శంకర్. వీరిది చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి తండా. ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేర్లు రావడంతో వారు నివస్తున్న గుడిసెను తొలగించి అదే స్థలంలో ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. బేస్‌మెంట్ వరకు పూర్తి చేసినా.. యాప్‌లో ఫొటో అప్‌లోడ్ కాకపోవడంతో బిల్లు మంజూరు కావడం లేదు. ఇప్పటికే రూ. రెండు లక్షల వరకు ఖర్చు చేశామని.. ఇక తాము ముందుకు వెళ్లలేకపోతున్నామని నిర్మాణ పనులు ఆపేశారు. అధికారులు వెంటనే స్పందించి తమకు ఇంటి బిల్లు వచ్చేలా చూడాలని కోరుతున్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): ఎన్నో ఆశలతో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం ప్రారంభించిన పేదలకు తిప్పలు తప్పడం లేదు. బేస్‌మెట్ వరకు పూర్తి చేసినా బిల్లు రాకపోవడంతో నిర్మాణాలు మధ్యలోనే వదిలేస్తున్నారు. యాప్‌లో ఇంటి నిర్మాణ ఫొటో అప్‌లోడ్ చేసిన వెంటనే రూ. లక్ష లబ్ధిదారుల అకౌంట్‌లో జమ చేస్తామని ప్రభుత్వం తెలిపింది. అయితే నెల రోజులుగా ఫొటో అప్‌లోడ్ కోసం అధికారులు చేస్తున్న ప్రయత్నం ఫలించడం లేదు. చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి తండాను ప్రజాపాలన పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించిన అధికారులు 80 మందిని ఇందిరమ్మ ఇళ్లకు అర్హులుగా తేల్చారు. ఇందులో అసలే ఇళ్లు లేని 25 మందికి మొదటి దశలో ఇళ్లు కేటాయించారు. వెంటనే పనులు ప్రారంభించాలని వారిని ఆదేశించారు. దీంతో గిరిజనులు తాము ఉంటున్న గుడిసెలను తొలగించి ఇంటి పనులు ప్రారంభించారు. ఇప్పటివరకు 10 మంది బేస్‌మెంట్ వరకు పనులు పూర్తిచేయగా, మరికొందరు పునాదులు తీశారు. అయితే ఫొటో అప్‌లోడ్ విషయమై ఇటీవల గృహ నిర్మాణ శాఖ పీడీ మాణిక్యం, ఇతర అధికారులు మిర్జాపల్లి తండాకు వచ్చి ప్రయత్నించినా ఫలితం కన్పించలేదు. దీంతో ఉన్న గుడిసెను తొలగించి తాత్కాలిక గుడారాల్లో నివసిస్తున్న తమ పరిస్థితి ఏంటని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై చిన్నశంకరంపేట ఎంపీడీఓ దామోదర్‌ను వివరణ కోరగా.. ఇందిరమ్మ యాప్‌లో ఏర్పడిన సమస్యతో ఫొటో అప్‌లోడ్ చేయలేకపోతున్నామని, ఇదే విషయం గృహ నిర్మాణ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఆన్‌లైన్ ప్రక్రియ కాకుండా ఆఫ్‌లైన్‌లో బిల్లు మంజూరు చేయాలని కోరామని, వారి నిర్ణయం కోసం వేచి చూస్తున్నట్లు చెప్పారు.

కాలేజీ యాజమాన్యం నిర్లక్ష్యం

రెండు గంటల ఆలస్యంగా డిగ్రీ సప్లిమెంటరీ పరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

తూప్రాన్: ఓ ప్రైవేట్ కళాశాల నిర్లక్ష్యం కారణంగా రెండు గంటల ఆలస్యంగా డిగ్రీ పరీక్ష జరిగిన ఘటన తూప్రాన్‌లో చోటు చేసుకుంది. గురువారం ఉదయం 9 గంటలకు నలుగురు విద్యార్థులు పట్టణంలోని నలంద డిగ్రీ కాలేజీకి పరీక్ష రాసేందుకు చేరుకున్నారు. అయితే కేంద్రానికి తాళం వేసి ఉండడంతో 9:30 గంటల వరకు వేచి చూశారు. సమయం మించి పోతుండడంతో ఆందోళనకు గురై తమ కుటుంబ సభ్యులకు విషయం చెప్పారు. వారు కేంద్రానికి చేరుకొని ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. అనంతరం తహసీల్దార్ విజయలక్ష్మికి సమాచారం అందించారు. ఆమె పరీక్ష కేంద్రానికి చేరుకొని నిర్వాహకులతో ఫోన్‌లో మాట్లాడి కేంద్రాన్ని తెరిపించారు. విద్యార్థులు నష్టపోకుండా ఉండేందుకు పరీక్షా పత్రాలను ఎగ్జామ్ రూట్ ఆఫీసర్ సమక్షంలో యూనివర్సిటీ లాగిన్ నుంచి డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందజేశారు. ఓయూ డైరెక్టర్ ఆఫ్ ఎగ్జామ్స్ ఆడిట్ అధికారితో మాట్లాడి రెండు గంటలు ఆలస్యంగా 11.45 గంటలకు బీఎస్సీ కంప్యూటర్స్ పరీక్షను నిర్వహించారు. అనంతరం కళాశాల యాజమాన్యంతో పాటు సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న కళాశాల గుర్తింపు రద్దు చేయాలని పలువురు డిమాండ్ చేశారు. ఇదిలాఉండగా జీతాలు ఇవ్వడం లేదనే కారణంతో అధ్యాపకులు కళాశాలకు రాలేదని తెలిసింది.

ప్రభుత్వ కళాశాలలో చేరండి

రామాయంపేట(మెదక్): ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు గ్రామాల బాట పట్టారు. గురువారం మండలంలోని కోనాపూర్‌లో అడ్మిషన్ డ్రైవ్ చేపట్టారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వ కళాశాలలో చేరాలని అవగాహన కల్పించారు. ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని, ఉచితంగా పుస్తకాలు, ఉపకార వేతనాలు, ఉచిత బస్‌పాస్ సదుపాయం అమలులో ఉంటుందని వివరించారు. పెద్ద మొత్తంలో ఫీజులు చెల్లించి ప్రైవేట్ కళాశాలల్లో చేరవద్దని సూచించారు. దీంతో పిల్లల తల్లిదండ్రులు అంగీకరించారు.



విద్యార్థులకు కరపత్రాలు అందజేస్తున్న లెక్చరర్లు

ఐక్యంగా హక్కులు సాధించుకోవాలి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి



కార్మికులతో కలిసి నినాదాలు చేస్తున్న సుహాసినిరెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): భవన నిర్మాణ రంగాల కార్మికులు ఐక్యతగా ఉండి హక్కులను సాధించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి తెలిపారు. గురువారం మేడే సందర్భంగా కౌడిపల్లిలో భవన నిర్మాణ కార్మికులు నూతనంగా నిర్మించిన భవనాన్ని ప్రారంభించి పతాకావిష్కరణ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్మికులు చట్టాలను తెలుసుకొని హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. పనికి తగిన వేతనం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈసందర్భంగా నూతన భవనం వద్ద నీటి సమస్యను తీర్చేందుకు బోరు వేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ దుర్గారెడ్డి, సిమెంట్ డీలర్లు నవీన్, భూమయ్య, విఠల్, సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ప్రశాంత్, శ్రీనివాస్, నాసర్‌ఖాన్, సురేష్, బాలకృష్ణ, శ్యాంకుమార్ పాల్గొన్నారు.

పెద్దమ్మకు బోనం



బోనాలతో భక్తులు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని కల్వకుంట గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణోత్సవంలో భాగంగా గురువారం బోనాలు ఊరేగింపు చేపట్టారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు సంతోషంగా ఉండాలని, పాడి పంటలు పండాలని అమ్మవారిని వేడుకున్నారు.

కేతకీలో భక్తుల సందడి



ఝరాసంగం(జహీరాబాద్): కేతకీ సంగమేశ్వర ఆలయం గురువారం భక్తులతో సందడిగా మారింది. తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్రలలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ ఆవరణలోని అమృతగుండంలో పవిత్ర పుణ్య స్నానాలు ఆచరించి, గుండంలోని జలలింగానికి పూజలు చేశారు. అనంతరం గర్భగుడిలోని పార్వతిపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయన పూజారులు భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

డీలక్స్ బస్సుల్లో రాయితీ

నారాయణఖేడ్: ఆర్టీసీ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే వారికి టికెట్ చార్జీల్లో 10శాతం రాయితీ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఖేడ్ డిపో మేనేజర్ మల్లేశయ్య గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. నెలవారీ సీజన్ టికెట్‌పై 20 రోజుల చార్జీతో 30 రోజులు ప్రయాణం చేసే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ సదుపాయం ఈ నెల 1వ నుంచి అమలులోకి వచ్చిందన్నారు. ఖేడ్ నుంచి జేబీఎస్‌కు రూ. 230 చార్జీకి గాను రాయితీతో రూ. 210లు చెల్లిస్తే సరిపోతుందని అన్నారు. ఖేడ్ నుంచి లింగంపల్లికి రూ. 210 గాను రూ. 190, ఖేడ్ నుంచి సంగారెడ్డికి రూ. 160కి గాను రూ. 140 చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. అదేవిధంగా ఖేడ్ నుంచి సంగారెడ్డి వరకు గల వివిధ స్టేజీలకు మంత్లీ సీజన్ టికెట్స్ ఇవ్వనున్నట్లు డీఎం చెప్పారు.

అడవిని కాపాడేదెలా?

పేట రేంజ్ పరిధిలో బీట్ ఆఫీసర్ల కొరత



పెద్దశంకరంపేట అటవీ శాఖ కార్యాలయం

పెద్దశంకరంపేట(మెదక్): అటవీశాఖకు సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఉన్న సిబ్బందిపై అదనపు భారం పడుతోంది. మరోవైపు అడవులపై పర్యవేక్షణ కొరవడుతోంది. విలువైన అటవీ సంపద తరలిపోతున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారు.

భారీగా కలప అక్రమ రవాణా

పెద్దశంకరంపేట ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో బీట్ ఆఫీసర్ల కొరత తీవ్రంగా ఉంది. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించకపోవడంతో ఈ ప్రాంతం నుంచి కలప అక్రమంగా తరలిపోతుంది. పెద్దశంకరంపేట రేంజ్ కార్యాలయ పరిధిలో అల్లాదుర్గం, రేగోడ్, టేక్మాల్, పాపన్నపేట మండలాలున్నాయి. ఇందులో పాపన్నపేట మండలం తప్ప ఇతర మండలాల్లో బీట్ ఆఫీసర్లు లేరు. ఇప్పటివరకు ఉన్న వారు బదిలీ, ఇతర ఉద్యోగాలకు వెళ్లడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. దీంతో క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరతతో అడవిపై అధికారుల పర్యవేక్షణ తగ్గింది. ఇదే అదనుగా అక్రమంగా కలప తరలుతోంది.


6,107 హెక్టార్ల అటవీ భూమి

పెద్దశంకరంపేట రేంజ్ పరిధిలో 6,107 హెక్టార్లలో అటవీ భూములున్నాయి. ఇటీవల నర్సాపూర్ రింగ్‌రోడ్డు పరిధిలో భూములు కోల్పోగా వాటిని పెద్దశంకరంపేట మండల పరిధిలో 4 ఎకరాలు, రేగోడ్ మండలం తిమ్మాపూర్ పరిధిలో 50 ఎకరాల వరకు రెవెన్యూ భూములను అటవీశాఖకు బదలాయించారు.

నాలుగు మండలాల్లో ఖాళీగా పోస్టులు

టేక్మాల్, పెద్దశంకరంపేట, పాపన్నపేట పరిధిలో సెక్షన్ ఆఫీసర్లు ఉండగా, రేగోడ్, అల్లాదుర్గం (వెంకటరావుపేట) పరిధిలో లేరు. పాపన్నపేటలో ఇద్దరు బీట్ ఆఫీసర్లు ఉండగా, పెద్దశంకరంపేట మండలం, రేగోడ్, టేక్మాల్‌లో ఖాళీగా ఉన్నాయి. అల్లాదుర్గంలో ఉన్న ఒకరు మెటర్నటీ లీవ్‌లో ఉండడంతో బీట్ ఆఫీసర్ల కొరత తీవ్రంగా ఉంది. రేగోడ్ పరిధిలో ఎవరూ లేకపోవడంతో సెక్షన్ అధికారులపై పని ఒత్తిడి పడింది. అలాగే అల్లాదుర్గం, రేగోడ్, పెద్దశంకరంపేట మండలాల పరిధిలో రెండేళ్లుగా చిరుతపులి సంచరిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వారికి క్షేత్రస్థాయిలో భరోసా కల్పించే వారు కరువయ్యారు.

ఉన్నతాధికారులకు నివేదించాం



పెద్దశంకరంపేట రేంజ్ పరిధిలో బీట్ ఆఫీసర్ల కొరతపై ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలో ఖాళీలు భర్తీ అయ్యే అవకాశం ఉంది. నిబంధనలకు విరుద్ధంగా కలప అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు. రాత్రి వేళ నిఘా సైతం పెంచుతాం.

– వికాస్, పెద్దశంకరంపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

నంగునూరు(సిద్దిపేట): రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు గట్లమల్యాల ఉన్నత పాఠశాల నుంచి ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం రమేశ్, ఫిజికల్ డైరెక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. గురువారం వారు మట్లాడుతూ.. పాఠశాలకు చెందిన ఈశ్వరి, వైష్ణవి, కిరణ్మి, షణ్ముఖ ప్రియ, డీ.అను, అశ్విని, హరిణి ప్రియ, అఖిల మంచి ప్రతిభ కనబర్చారన్నారు. 2 నుంచి జగిత్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు వీరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. విద్యార్థుల కోరిక మేరకు గట్లమల్యాలలో వారం రోజులపాటు శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేసి సాఫ్ట్‌బాల్ క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చి మెలకువలు నేర్పించామన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

చిన్నశంకరంపేట(మెదక్): గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్‌వైరుతోపాటు ఆయిల్‌ను చోరీ చేశారు. ఈ ఘటన చిన్నశంకరంపేట మండలం సూరారం గ్రామంలో చోటు చేసుకుంది. సూరారం గ్రామ శివారులోని పంట పొలాలకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు రాత్రి సమయంలో ధ్వంసం చేశారు. విలువైన కాపర్ వైరు, ఆయిల్ చోరీ చేసినట్లు గుర్తించిన రైతులు ట్రాన్స్‌కో లైన్‌మెన్ భిక్షపతి దృష్టికి తీసుకుపోయారు. ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి చోరీ చేసిన ఘటనపై పోలీస్‌లకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

8న పుస్తకాల ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న మరసం ప్రతినిధులు


సిద్దిపేటకమాన్: ప్రముఖ కవి అలాజ్‌పూర్ కిషన్ రచించిన 'పేగు తెగిన పాట', 'వడిసెల' కవిత్వం పుస్తకాల ఆవిష్కరణ 8న పట్టణంలో జరుగనున్నట్లు మంజీరా రచయితల సంఘం అధ్యక్షుడు కె.రంగాచారి తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ.. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరగనున్న ఈ సభకు ప్రముఖులు హాజరు కానున్నట్లు తెలిపారు. సాహితీ ప్రియులు, కవులు, రచయితలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో యాదగిరి, శ్రీనివాస్, అశోక్, రాజశేఖర్ రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



వెల్దుర్తి(తూప్రాన్) : మండలం పరిధి ధర్మారం అటవీ ప్రాంతంలోని నముండ్ల కుచ్చల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గ్రామానికి చెందిన సాయిరాం అనే వ్యక్తి గమనించి గ్రామస్తులు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి ఎస్‌ఐ రాజు చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి వయస్సు సుమారు 55 నుంచి 60 ఏళ్లు ఉంటుందని, తలపై తెలుపు రంగు వెంట్రుకలు, ఒంటిపై ఎరుపు రంగు బనియన్, నలుపు రంగు ప్యాంటు ఉందన్నారు. కుడి చేతిపై ఇటికె అంజయ్య అనే పేరుతో పచ్చబొట్టు ఉందన్నారు. ఎవరైనా ఆనవాళ్లు గుర్తిస్తే వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించండి



మాట్లాడుతున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

తూప్రాన్: మున్సిపల్ పరిధిలోని ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆర్డీఓ జయచంద్రారెడ్డి మున్సిపల్ సిబ్బందికి సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ, నీటి పారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ, నీటి పారుదల శాఖ వద్ద ఉన్న మొత్తం 173 పెండింగ్ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అవినీతి ఆరోపణలకు తావులేకుండా పూర్తి చేయాలని సూచించారు. అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ గణేశ్ రెడ్డి, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

సాగుకు సన్నద్ధం

- వానా కాలానికి దుక్కి దున్నుతున్న రైతులు
- జిల్లాలో 5.60 లక్షల ఎకరాల్లో సాగు అంచనా
- అత్యధికంగా 3.75 లక్షల ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశం
- ఎరువులు, విత్తనాలను సిద్ధం చేసిన వ్యవసాయాధికారులు

వానాకాలం పంట సాగు కు జిల్లాలోని రైతులు సన్నద్ధం అవుతున్నారు. వర్షం పడగానే వెంటనే విత్తనాలు విత్తే విధంగా తమ భూములను తయారు చేస్తున్నారు. అందుకుగాను భూమిని దున్నడంతోపాటుగా, అందులో పశువుల ఎరువులు చల్లుతున్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారులు సైతం వానాకాలం ప్రణాళిక ను సిద్ధం చేశారు. నాణ్యమైన విత్తనాలతో మాత్రమే పంటలు సాగుచేయాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా నీటి అవసరం తక్కువగా ఉన్న పంటలను, అధిక దిగుబడి ఇచ్చే వంగడాలను సాగు చేయాలని సూచిస్తున్నారు. –ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)

జిల్లాలో 6.30 లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా, వానాకాలంలో అధికంగా వరి, మొక్కజొన్న, పత్తి, కందులు సాగవుతాయి. అందుకు తగిన విధంగా వ్యవసాయ అధికారులు విత్తనాలు, పంటలకు సరిపోయే విధంగా ఎరువులు సిద్ధం చేశారు. ఈ వానాకాలం సాగులో 3.75 లక్షల ఎకరాల్లో వరి, 30,000 ఎకరాల్లో మొక్కజొన్న, 1,10,000 ఎకరాల్లో పత్తి, 6,000 ఎకరాల్లో కందులు, 39 వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగు అయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. గత వర్షాకాలంలో 5.50 లక్షల ఎకరాల్లో సాగు అవ్వగా, ఈసారి 5,60,000 ఎకరాల్లో సాగు అవుతుందని అధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు. 44,000 మెట్రిక్ టన్నుల యూరియా, 50,000 (కాంప్లెక్స్, డీఏపీ, పోటాషియం, ఇతర ఎరువులు) మెట్రిక్ టన్నుల ఇతర ఎరువులను రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు కేటాయించినట్లు అధికారులు తెలిపారు.



ముందస్తు తూకం ఉత్తమం

నీటి వసతులు ఉన్న రైతులు ముందుగానే తూకాలు పోసుకోవడం ఉత్తమం. నీటి సౌకర్యం లేని రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకుంటే బాగుంటుందని అధికారులు చెబుతున్నారు. ముందుగా పంటను సాగు చేయడం ద్వారా క్రిమి కీటకాల నుంచి, అదే విధంగా ప్రకృతి విపత్తుల నుంచి పంటను కాపాడుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. అందువల్ల నీటి వసతి ఉన్న రైతులు ఒక నెల ముందుగానే నారు మడ్లు సిద్ధం చేసుకోవాలి.

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు

జిల్లాలో వానాకాలంలో సాగులో భాగంగా రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనల మేరకు విత్తనాలను ఎంపిక చేసుకోవాలి. వివిధ రకాల విత్తన కంపెనీల నిర్వాహకులు రైతులను మోసం చేసే అవకాశం ఉంటుంది. అందువల్ల క్రిమికీటకాలను తట్టుకునే, అధిక దిగుబడి ఇచ్చే మేలు జాతి నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవడం ఉత్తమం.

సకాలంలో ఎరువులు, విత్తనాలు



వానాకాలం పంటలు సాగు చేసేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు. వారికి సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించే విధంగా ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాం. జిల్లాలోని సాగుకు అనుగుణంగా విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉంచాం. రైతులు అడిగిన వెంటనే విత్తనాలు అందించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. నకిలీ విత్తనాలకు మోసపోకుండా, అధిక దిగుబడి ఇచ్చే నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి. అవసరమైతే స్థానిక వ్యవసాయాధికారిని సంప్రదించాలి. గతేడాది కంటే ఈసారి సాగు అధికంగా అయ్యే అవకాశం ఉంది.

–రాధిక, జిల్లా వ్యవసాయాధికారి

నిజమైన ప్రేమకు అర్థం

దుబ్బాకటౌన్ : ఏడడుగులు నడవడమే కాదు.. జీవితంతాం తోడుగా ఉంటారనడానికి ఈ దృశ్యమే నిదర్శనం. మానవత్వాలే మంటలో కలుస్తున్న నేటి సమాజంలో వృద్ధాప్యంలో సైతం నాకు నువ్వు, నీకు నేను అని ప్రేమతో తన భార్యకు తినిపిస్తున్న దృశ్యం దుబ్బాకలో 'సాక్షి' కంటపడింది. భార్యాభర్తల అనే పదానికి సరైన అర్థాన్ని చాటి చెబుతున్నారు.



భార్యకు తినిపిస్తున్న భర్త

తల్లిదండ్రుల ప్రేమకు దూరం

కోహెడరూరల్(హుస్నాబాద్): గతంలో తండ్రి.. రెండు రోజుల కిందట తల్లి మృతి చెందడంతో ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు. ఈ విషాదకర ఘటన మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ఉత్కం బాలయ్య 13 ఏళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. భార్య ఉత్కం కవిత(40) కూలీ పని చేసుకుంటూ కూతురు వైష్ణవి(17), కుమారుడు రామ్‌చరణ్(15)ను పోషించుకుంటుంది. కవిత బుధవారం ఉపాధి హామీ కూలీకి వెళ్లి వడదెబ్బతో రాత్రి మృతి చెందింది. దీంతో ఇద్దరు పిల్లలు తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారారు. అమ్మమ్మ కూడా వృద్ధురాలు కావడంతో పిల్లలు ఎలా బతకాలి దేవుడా అని



తల్లి మృతదేహం వద్ద ఏడుస్తున్న చిన్నారులు

ఏడుస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ఆ చిన్నారులను ఆదుకోవాలని స్థానికులు, కుటుంబ సభ్యులు దాతలను కోరుతున్నారు. సాయం చేయాలకునే వారు ఫోన్‌పే నంబర్ 98489 24347 పోలు శ్రీనివాస్, గుగూల్ పే నంబర్ 96663 38616 బండిపెల్లి శ్రీకాంత్‌కు పంపగలరని కోరారు.

అంతర్జాతీయ విద్యా పురస్కారానికి ఎంపిక

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): అంతర్జాతీయ విద్యా పురస్కారానికి మండలంలోని నిజాంపూర్ కాలనీ హెచ్‌ఎం రామకృష్ణ ఎంపికైనట్లు వరల్డ్ ఛారిటీ వెల్ఫేర్ ఫౌండేషన్ మేనేజర్ మమత కక్రక గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యా, సామాజిక, సేవా రంగాలతోపాటు పర్యావరణ పరిరక్షణకు చేసిన విశేష కృషికి గాను ఈ పురస్కారం అందజేస్తున్నట్లు వారు తెలిపారు. 28న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో పురస్కారం అందజేస్తామని పేర్కొన్నారు.



రామకృష్ణ

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



సురేశ్ మృతదేహం

వట్‌పల్లి(అందోల్): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన అందోలు మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో గురువారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ప్రభాకర్, ఏసయ్యకి చెందిన మామిడి తోటను పుల్కల్ మండలం సింగూరు గ్రామానికి చెందిన దాసరి సురేశ్ (32) లీజుకు తీసుకున్నాడు. రోజు మాదిరిగానే బుధవారం తోటలో మామిడి చెట్లకు నీరు పట్టేందుకు వెళ్లాడు. సురేశ్ చీకటైనా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో భార్య శిరీష గురువారం మామిడి తోటకు వెళ్లి చూడగా విగతజీవిగా పడి ఉన్నాడు. వెంటనే పక్కన ఉన్న పొలాల వారి సాయంతో పోలీసులకు సమాచారం అందించింది. అనంతరం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భర్త మృతిపై అనుమానంగా ఉందని, విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని మృతుడి భార్య శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ మరో యువకుడు

మద్దూరు(హుస్నాబాద్): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని బైరాన్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నజీర్ కుమారుడు ఇర్ఫాన్(20) ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాల్లో మూడు సబ్జెక్ట్‌ల్లో ఫెయిల్ అయ్యాడు. దీంతో మనస్తాపానికి గురై 29న ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. తీవ్ర గాయాలైన యువకుడిని హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. యువకుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సంగారెడ్డి పట్టణంలో మహిళ

సంగారెడ్డి క్రైమ్: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేశ్ కథనం మేరకు.. పట్టణంలోని మార్క్స్‌నగర్ కాలనీకి చెందిన చాకలి దశరథ్, మాధవి దంపతులు. దశరథ్ సంగారెడ్డి మున్సిపాలిటీలో వృత్తిరీత్యా కాంట్రాక్ట్‌గా పని చేస్తున్నాడు. మూడేళ్ల కిందట మాధవి తన భర్తతో గొడవ తల్లిగారిల్లు కంది మండలంలోని ఇంద్రేశం గ్రామానికి వెళ్లింది. తన దగ్గర ఉన్న బంగారం, డబ్బుతో హోటల్ పెట్టింది. తల్లి 3 నెలల కిందట చనిపోయింది. బిజినెస్‌లో నష్టాలు రావడం, తల్లి మరణంతో మనస్తాపానికి గురై 15 రోజుల కిందట భర్త వద్దకు వచ్చి ఉంటుంది. గురువారం దంపతుల మధ్య బంగారం విషయమై గొడవలు జరిగాయి. దశరథ్ పనికి వెళ్లి ఇంటికొచ్చేసరికి భార్య ఇంటి ఎదుట గల రేకుల షెడ్డుకు ఉరేసుకొని కనిపించింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఫ్లై ఓవర్‌పై నుంచి దూకి కూలీ ఆత్మహత్య



రోడ్డుపై చంద్రప్ప మృతదేహం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఫ్లై ఓవర్‌పై నుంచి దూకి కూలీ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రామచంద్రాపురం పట్టణంలోని లింగపల్లి చౌరస్తాలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రంగారెడ్డి జిల్లా చేవెళ్లకు చెందిన చంద్రప్ప(38) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తల్లి వెంకటమ్మ పది రోజుల కిందట తెల్లాపూర్‌లో నివాసముండే పెద్ద కుమారుడు అంజప్ప వద్దకు వచ్చింది. గత నెల 29న ఫోన్ చేసి నేను కూడా అన్న ఇంటి వద్దకు వస్తానని చెప్పాడు. గురువారం ఉదయం 9.30 గంటల సమయంలో చంద్రప్ప లింగంపల్లి చౌరస్తాలో నూతనంగా నిర్మించి ఫ్లై ఓవర్‌పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చంద్రప్ప కొంతకాలంగా అప్పులు చేసి తీర్చలేకపోవడం, ఒంటరితనం వల్ల మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి కంటే ముందు లింగంపల్లి చౌరస్తాలో వేగంగా వస్తున్న బస్సు ముందుకు చంద్రప్ప దూసుకుపోగా డ్రైవర్ బ్రేక్ వేసినట్లు స్థానికులు తెలిపారు. తర్వాత ఫ్లై ఓవర్‌పై నుంచి దూకినట్లు పేర్కొన్నారు.

మానసిక వేదనతో వ్యక్తి..



నాగరాజు(ఫైల్)

వర్గల్(గజ్వేల్): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వర్గల్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్ రెడ్డి కథనం మేరకు.. వర్గల్‌కు చెందిన దాచ నాగరాజు(34)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మానసికంగా కుంగిపోయి గురువారం ఉదయం పెంట్‌హౌజ్ రేకుల షెడ్‌లో స్నానం చేసి వస్తానని వెళ్లాడు. అక్కడే పైపునకు ఉరేసుకొని ఆత్మహత్మకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో ఉరేసుకొని



దుర్గయ్య (ఫైల్)

హత్నూర (సంగారెడ్డి): కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హత్నూర మండలం మంగాపూర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మంగాపూర్ గ్రామానికి చెందిన మాదారం దుర్గయ్య (36) అతడి తమ్ముడు ఆగు భాస్కర్ కుటుంబీకులు వేర్వేరుగా ఉంటున్నారు. అయినప్పటికీ తరచూ ఇరువురి మధ్య గొడవలు జరుగుతూ వస్తున్నాయి. బుధవారం దుర్గయ్య –భాస్కర్ కుటుంబాలు వాగ్వాదానికి దిగాయి. గ్రామ పెద్దలు మాట్లాడి ఇరువురికి నచ్చజెప్పారు. గురువారం గ్రామ శివారులోనే ఓ వ్యవసాయ పొలం వద్ద వెళ్లిన దుర్గయ్య చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు స్థానికులు పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుభాష్ తెలిపారు.

నిప్పంటుకొని గాయాలు

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి

గజ్వేల్‌రూరల్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందినట్లు గజ్వేల్ పోలీసులు గురువారం తెలిపారు. వర్గల్ మండలం మజీద్‌పల్లికి చెందిన దావని గంగమణి(42) గజ్వేల్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తుంది. గత నెల 26న పాఠశాల ఆవరణలో ఉన్న చెత్తను అంటిపెడుతున్న క్రమంలో మంటలు అంటుకొని గాయాలపాలైంది. వెంటనే తోటి సిబ్బంది గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం బాధిత కుటుంబ సభ్యులు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా బుధవారం రాత్రి గంగమణి మృతి చెందింది.

కడుపు ఖరీదు రూ.4.30 లక్షలు

- యువతిని గర్భవతిని చేసి ముఖం చాటేసిన యువకుడు
- పెద్దల పంచాయితీలో డబ్బులు ఇవ్వాలని తీర్పు
- పాపన్నపేట మండలంలో ఘటన

పాపన్నపేట(మెదక్): అమాయక యువతిని ఓ యువకుడు మోసం చేసి గర్భవతిని చేయగా, పెద్దలు నిర్వహించిన పంచాయితీలో కడుపు ఖరీదు రూ.4.30 లక్షలుగా నిర్ధారించి తీర్పు చెప్పిన ఘటన మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని ఓ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఆ గ్రామానికి చెందిన ఓ యువతి డిగ్రీ చదువుతుంది. అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు ఆమెను ప్రేమ పేరుతో లొంగ దీసుకున్నట్లు తెలిసింది. కొన్నాళ్లపాటు జరిగిన ఈ ప్రేమాయణం ఫలితంగా ఆ అమ్మాయి గర్భం దాల్చినట్లు సమాచారం. ఈ విషయం వారం రోజుల కిందట గ్రామ పెద్దల వరకు చేరింది. ఇరు కుటుంబాల అభ్యర్థన మేరకు గురువారం పంచాయితీ నిర్వహించారు. చివరకు అబ్బాయికి రూ.4.30 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు సమాచారం.

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం

ఇంటి నుంచి బయటకు వెళ్లి వ్యక్తి



కిరణ్ కుమార్

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి బయటకు వెళ్లి వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎస్‌ఐ కోటేశ్వర్ రావు కథనం మేరకు.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సింపోని పార్క్ హోమ్స్‌కు చెందిన కిరణ్ కుమార్ గత నెల 28న ఇంటి నుంచి స్కూటీ తీసుకొని బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ వచ్చింది. కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త అదృశ్యంపై భార్య అనిత గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పనికెళ్లి మరో వ్యక్తి

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ వెంకట్రావునగర్ కాలనీకి చెందిన 38 ఏళ్ల షేక్ మౌలానా గత నెల 29 నుంచి కనిపించకుండా పోయినట్లు పట్టణ పోలీసులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మేస్త్రీగా పని చేసే మౌలానా పని కోసమే వెళ్లి తిరిగి రాలేదని అతడి భార్య సీమా ఫాతిమా ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పటాన్‌చెరులో వివాహిత



సౌందర్య

పటాన్‌చెరు టౌన్: వివాహిత అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కంగ్టి మండలానికి చెందిన సౌందర్యకు నారాయణఖేడ్ మండలం కొండాపూర్ తండాకు చెందిన కేతావత్ రామచందర్ తో వివాహం జరిగింది. వివాహం అనంతరం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని చైతన్య నగర్‌కి వచ్చి నివాసం ఉంటున్నారు. గత నెల 24న సౌందర్య కనిపించడం లేదని రామచందర్ అత్తామామలకు చెప్పాడు. సౌందర్య కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. మద్యానికి బానిసైన రామచందర్ నిత్యం తమ కూతురిని హింసించేవాడని, అతడిపై అనుమానం ఉందని బాధితురాలి తల్లి బుజ్జిబాయి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు న మోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రక్త దాతలు.. ఈ కవలలు

- 20 సార్లకు పైగా రక్తదానం
- ఆదర్శంగా నిలుస్తున్న జహీరాబాద్ పట్టణానికి చెందిన అన్నాదమ్ముళ్లు

జహీరాబాద్ టౌన్: అన్నిదానాల్లో కెల్లా.. రక్తదానం గొప్పది. మనమిచ్చే రక్తం మరొకరి ప్రాణాలు కాపాడుతోంది. రక్తం అందక చనిపోయే వారు ఎక్కువ మందే ఉన్నారు. ప్రాణాలను కాపాడేందుకు అవసరమయ్యే రక్త దానం చేసే దాతలు చాలా మంది ఉన్నారు. కొంత మంది అనేక సార్లు రక్తదానం చేస్తూ స్ఫూర్తిగా నిలిస్తుంటారు. అలాంటి కోవకు చెందిన వారే జహీరాబాద్ పట్టణానికి చెందిన ఈ ఇద్దరు అన్నాదమ్ముళ్లు.

జహీరాబాద్ పట్టణంలోని విద్యుత్ కాలనీకి చెందిన జయప్రకాశ్, విజయ్‌కుమార్ ఇద్దరూ కవలు. ఇద్దరు కూడా ప్రభుత్వ ఉపాధ్యాయులే. పేదరికం కారణంగా తండ్రి చాలా కష్ట పడి పిల్లలను చదవించారు. బీహెడ్ పూర్తి ఒకరు 2008, మరొకరు 2012 సంవత్సరంలో ఉద్యోగంలో చేరారు. వీరికి దేశ భక్తి, దైవ భక్తి ఎక్కువే. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతూ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. జహీరాబాద్ పట్టణంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారని తెలిస్తే చాలా రక్తదానం చేయడానికి ముందుంటారు. ఏ పని చేసినా ఇద్దరూ కలిసే చేస్తారు. ఇప్పటి వరకు 20 సార్లకు పైగా రక్తదానం చేశారు. జహీరాబాద్ పట్టణంలోని దత్తగిరి కాలనీలో బసవ మండపంలో రాష్ట్రీయ బసవదళ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు.



జయప్రకాశ్, విజయకుమార్

నిర్వహణ బరువు ఆహ్లాదం కరువు

సంగారెడ్డి టౌన్ : సంగారెడ్డి పట్టణంలోని 10వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలో పట్టణ ప్రకృతి వనం ఏర్పాటు చేశారు. మొదట్లో చిన్నారులు ఆడుకునేందుకు వస్తువులు, పెద్దలు వాకింగ్, జాగింగ్ చేయడానికి నడక దారి ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో జనంతో వనం కళకళలాడుతుండేది. వృద్ధులు కూడా కొంత సేపు సేదతీరేవారు. పలువురు యోగా సనాలు వేసుకునేవారు. ప్రస్తుతం మాత్రం వనం నిర్వహణ అధ్వానంగా మారింది. పిచ్చిమొక్కలతో దర్శనమిస్తోంది. పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా మారాయి. చుట్టుపక్కల వారు చెత్త వేయడంపాటు పార్కులో ముళ్లపొదలు పెరిగి చిన్న పిల్లలు ఆడుకోవడానికి ఇబ్బందిగా మారింది. వేసవి సెలవులు రావడంతో పిల్లలు ఆటలు ఆడుకోవడానికి పార్కుకు వచ్చేవారు. కానీ అక్కడ వసతులు లేక అటువైపు చూడటం లేదు. మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోయారు. వెంటనే అధికారులు పార్కును శుభ్రం చేయించి, చెత్త కుప్పలను తొలగించి పాడైన వస్తువులను బాగు చేయించాలని కోరుతున్నారు.





పేరుకుపోయిన చెత్తాచెదారం



పాడైపోయిన ఆట పరికరాలు



ముళ్ల పొదలతో పట్టణ ప్రకృతి వనంలో సేద తీరే ప్రాంతం